ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక
తెలుగు దినపత్రికలో పనిచేయడానికి
ఆసక్తి కలవారికి ఆహ్వానము.
వివరాలకు సంప్రదించండి : 7780470374
మహబూబాబాద్ జిల్లాలో ఖాళీలు :

| | | | |
|---|---|---|---|
| కొత్తగూడ | గార్ల / కురవి | దంతాలపల్లి | పెద్దవంగర |
| గంగారం | బయ్యారం | చిన్నగూడూరు | నెల్లికుదురు |
| కేసముద్రం | మరిపెడ | నర్సింహులపేట | ఇనుగుర్తి |


PRABHATA GAMANAM
ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

శనివారం 28, ఫిబ్రవరి 2026 | సంపుటి :01 | సంచిక :8 | పేజీలు :4



# ఇంకెన్నాళ్లు..?

## కేసముద్రంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు కలేనా?

- ఐదేళ్ల క్రితమే ప్రతిపాదనలు పంపినా ఫలితం శూన్యం
- నేటికీ మంజూరుకు నోచుకోని వైనం
- మండలంలో కార్యరూపం దాల్చని దుస్థితి
- ప్రమాదం జరిగితే 18 కిలోమీటర్ల దూరం నుంచి శకటాలు రావాల్సిందే
- సకాలంలో ఫైర్ ఇంజన్ రాక భారీ ఆస్తి నష్టం జరిగిన ఘటనలెన్నో..
- రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ పెద్దలు ఉన్నా ఫలితం సున్నా
- ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు అడుగులు పడాలంటున్న మండల ప్రజలు

— ప్రభాత గమనం, కేసముద్రం

కేసముద్రం మండలంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు కలగానే మిగిలింది. 34 పంచాయతీలు, 380 వార్డులు,68,686 మంది జనాభా గల నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన కేసముద్రంలో అగ్నిమాపక కేంద్రం (ఫైర్ స్టేషన్) ఏర్పాటు చేయాలని గత ఐదేళ్ల క్రితమే ప్రతిపాదనలు పంపారు. అయితే ఆ దిశగా ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు.మండలంలో ప్రభుత్వ పెద్దలున్న ఫలితం సున్నా అని ప్రజలు విమర్శిస్తున్నారు. గ్రామీణ,పట్టణ ప్రాంతం మిళితమైన కేసముద్రంలో పరిశ్రమలు,వివిధ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, హోటల్లు, బహుళ అంతస్తుల భవనాలు ఉన్నాయి.దీంతోపాటు గ్రామాలలో,వార్డుల్లో ఇప్పటివరకు పూరిపాక ఆవాసాలున్నాయి. ఇక వ్యవసాయపరంగా కేసముద్రం మండలంలో వరి,పత్తి, మిర్చి,మొక్కజొన్న, పసుపు తోటలు సాగులో ఉన్నాయి. అధిక జనసాంద్రత అలాగే విద్య, పారిశ్రామిక వ్యాపార రంగాలు ఉన్న కేసముద్రంలో ఏదైనా భారీ అగ్రి ప్రమాదం సంభవిస్తే సుమారు 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఫైర్ ఇంజన్ వచ్చేవరకు వేచి ఉండాల్సిందే. గత రెండేళ్ల క్రితం కేసముద్రం మండల పరిధిలోని అనేక ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఈ ప్రమాదాల వల్ల పలువురికి లక్షల్లో ఆస్తి నష్టం వాటిల్లి ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్..

పెండింగ్ బిల్లులు రూ.745 కోట్లు విడుదల

04

2

## మిథేన్ అన్వేషణకు సింగరేణికి అవకాశం

- వేలంలో పాల్గొనాలని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ సూచన
- సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతితో ఏడీజీ సచివ్ కుమార్ భేటీ

04



## కల్వకుంట్ల కవితకు క్లీన్ చిట్

- ఆమెతో మొత్తం 23 మందికి ఊరట
- లిక్కర్ స్కాం కేసును కొట్టేసిన ఢిల్లీ కోర్టు
- చార్జీషీటుకు, సమర్పించిన ఆధారాలకు పొంతనలేదని సీబీఐకి అక్షింతలు

4

శనివారం
28.02.2026
www.prabhatagamanam.com

ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక



# ఇంకెన్నాళ్లు..?

## కేసముద్రంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు కలేనా?

- ఐదేళ్ల క్రితమే ప్రతిపాదనలు పంపినా ఫలితం శూన్యం
- నేటికీ మంజూరుకు నోచుకోని వైనం
- మండలంలో కార్యరూపం దాల్చని దుస్థితి
- ప్రమాదం జరిగితే 18 కిలోమీటర్ల దూరం నుంచి శకటాలు రావాల్సిందే
- సకాలంలో ఫైర్ ఇంజన్ రాక భారీ ఆస్తి నష్టం జరిగిన ఘటనలెన్నో..
- రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ పెద్దలు ఉన్నా ఫలితం సున్నా
- ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు అడుగులు పడాలంటున్న మండల ప్రజలు

కేసముద్రం ఫిబ్రవరి 27(ప్రభాత గమనం): కేసముద్రం మండలంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు కలగానే మిగిలింది. 34 పంచాయతీలు, 380 వార్డులు,68,686 మంది జనాభా గల నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన కేసముద్రంలో అగ్నిమాపక కేంద్రం (ఫైర్ స్టేషన్) ఏర్పాటు చేయాలని గత ఐదేళ్ల క్రితమే ప్రతిపాదనలు పంపారు. అయితే ఆ దిశగా ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు.మండలంలో ప్రభుత్వ పెద్దలున్న ఫలితం సున్నా అని ప్రజలు విమర్శిస్తున్నారు. గ్రామీణ,పట్టణ ప్రాంతం మిళితమైన కేసముద్రంలో పరిశ్రమలు,వివిధ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, హోటల్లు, బహుళ అంతస్తుల భవనాలు ఉన్నాయి.దీంతోపాటు గ్రామాలలో,వార్డుల్లో ఇప్పటివరకు పూరిపాక ఆవాసాలున్నాయి. ఇక వ్యవసాయపరంగా కేసముద్రం మండలంలో వరి,పత్తి, మిర్చి,మొక్కజొన్న, పసుపు తోటలు సాగులో ఉన్నాయి. అధిక జనసాంద్రత అలాగే విద్య, పారిశ్రామిక వ్యాపార రంగాలు ఉన్న కేసముద్రంలో ఏదైనా భారీ అగ్ని ప్రమాదం సంభవిస్తే సుమారు 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఫైర్ ఇంజన్ వచ్చేవరకు వేచి ఉండాల్సిందే. గత రెండేళ్ల క్రితం కేసముద్రం మండల పరిధిలోని అనేక ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఈ ప్రమాదాల వల్ల పలువురికి లక్షల్లో ఆస్తి నష్టం వాటిల్లి ఉంటుందని అధికారులు అంచనా వేశారు. మండలంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో అగ్నిప్రమాదం జరిగినప్పుడు సకాలంలో మంటలు అదుపులోకి రాక భారీ నష్టం జరుగుతుంది. కేసముద్రంలో ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే మహబూబాబాద్ నుంచి ఫైర్ ఇంజన్ ఇక్కడ వరకు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చేసరికి జరగాల్సిన నష్టం జరిగిపోతుందని మండల ప్రజలు ఆవేదన చెందుతున్నారు..

### - ఫైర్ ఇంజన్ రావడానికి అరగంటపైనే..

మహబూబాబాద్ లోని అగ్నిమాపక కేంద్రం సుమారు 18 కిలోమీటర్ల దూరంలో ఉంది.కేసముద్రంలో అగ్ని ప్రమాదం జరిగితే అక్కడ నుంచి అగ్నిమాపక శకటాలు ఎంత వేగంగా వచ్చిన అరగంట పైనే సమయం పడుతుంది. ఈ అరగంట సమయంలోనే జరగరాని నష్టం జరిగిపోతుంది. అదే కేసముద్రంలో అగ్నిమాపక కేంద్రం ఉన్నట్లైతే ఈ పరిస్థితి తలెత్తకుండా నష్ట నివారణ చర్యలు వేగంగా చేపట్టే అవకాశం ఉంటుందని ప్రజలు అంటున్నారు.కేసముద్రం మండల కేంద్రంలో చాలా ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయి.ఈ ఆక్రమణల నుంచి భూమిని ప్రభుత్వం స్వాధీన పరచుకొని అందులో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే బాగుంటుందని స్థానికులు అంటున్నారు.కాబట్టి అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి ఈ ప్రాంతంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

### కేసముద్రంలో ఏర్పాటు చేయాలి

**మంద శశికుమార్, విద్యార్థి నాయకుడు**



కేసముద్రం మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి దీంతో రైతులకు వ్యాపారస్తులకు సకాలంలో ఆస్తి నష్టం జరగకుండా కాపాడవచ్చు ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం అయినా అందుకు అనుగుణంగా అడుగులు వేయాలి దీనిపై స్థానిక ఎమ్మెల్యే స్పందించి చర్యలు చేపట్టాలి.

### అగ్నిమాపక కేంద్రం వెంటనే మంజూరు చేయాలి

**మంద ప్రవీణ్, ఉప్పరపల్లి**



అగ్నిమాపక కేంద్రం లేక ఏదైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే అధిక మొత్తంలో ఆస్తి నష్టం జరుగుతూనే ఉంది. రైతుల యొక్క గడ్డివాములు, వివిధ రైతులల్లో అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు భారీగా ఆస్తి నష్టం జరిగింది. ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే స్పందించి వెంటనే కేసముద్రంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి.

## కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడదాం

### ఇఫ్టూ నేత కన్మంతరెడ్డి భాస్కర్ రెడ్డి పిలుపు




ప్రభాత గమనం, కేసముద్రం: మార్చి 1న కేసముద్రంలో నిర్వహించనున్న భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకుడు కన్మంతరెడ్డి భాస్కర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రం ఇనుగుర్తిలో గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తీవ్రంగా విమర్శించారు. 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, యజమానులకు అనుకూలంగా 4 లేబర్ కోడ్‌లను తీసుకురావడం కార్మికుల హక్కులకు భంగం కలిగించేదని అన్నారు. అసంఘటిత రంగ కార్మికుల శ్రమను కార్పొరేట్లకు అనుకూలంగా మార్చుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల వేతనాలు, భద్రత, సౌకర్యాల కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు కరీం, చిన్న మౌలానా, ఇమామ్, దేశ్ల, హుస్సేన్ బీబీ, యాకూబీ తదితరులు పాల్గొన్నారు.

## గ్రేటర్ వరంగల్ కు వంద ఎలక్ట్రిక్ బస్సులు

### హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్



ప్రభాత గమనం, హనుమకొండ: ప్రజా రవాణాలో భాగంగా గ్రేటర్ వరంగల్ నగరానికి ప్రభుత్వం వంద ఎలక్ట్రిక్ బస్సులను మంజూరు చేసిందని, బస్సుల నిర్వహణ కోసం ప్రతిపాదిత స్థలాన్ని త్వరగా అప్పగించేందుకు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో ఆర్టీసీ, రెవెన్యూ శాఖల అధికారులతో ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ కోసం మడికొండలో ప్రతిపాదిత స్థలం, నిర్వహణ అంశాలకు సంబంధించిన వివిధ అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ ప్రభుత్వం కేటాయించిన వంద ఎలక్ట్రిక్ బస్సులు గ్రేటర్ వరంగల్ పరిధిలో నడుస్తాయన్నారు. మడికొండలో ప్రతిపాదిత ఐదెకరాల స్థలాన్ని ఆర్టీసీ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా పరిశీలించాలని ఆదేశించారు. స్మార్ట్ సిటీ పథకంలో భాగంగా హనుమకొండ చౌరస్తా బస్ బే అభివృద్ధి చేయడంపై ఆర్టీసీ, కుడా అధికారులతో ఈ సందర్భంగా చర్చించారు. కాజీపేటలో ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణ అంశాలపై సమీక్షించారు. సమావేశంలో డిప్యూటీ ఆర్ఎం భాను కిరణ్, మధు, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, ఆర్టీసీ డిఎం ధరమ్ సింగ్, తహసీల్దార్ రాజు పాల్గొన్నారు.

## చేతిపంపు మరమ్మత్తుతో నీటి సరఫరా పునరుద్ధరణ

గార్ల, ఫిబ్రవరి 27 (ప్రభాత గమనం): గార్ల మండలం పుల్లూరు గ్రామంలో చేతిపంపు చెడిపోవడంతో గ్రామస్తులు తీవ్ర నీటి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాగునీటి సమస్యతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికుల ఫిర్యాదుతో స్పందించిన గ్రామ సర్పంచ్ అజ్మీరా బాబురావు వెంటనే మరమ్మత్తులు చేపట్టించి చేతిపంపును సరిచేయించారు. దీంతో గ్రామంలో నీటి సరఫరా పునరుద్ధరించబడింది. సమస్యను తక్షణమే పరిష్కరించిన సర్పంచ్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక
శనివారం
28.02.2026
www.prabhatagamanam.com




# హైదరాబాద్ స్థాయి వైద్య సేవలు ఓరుగల్లులోనే..

- త్వరలో అందుబాటులోకి సూపర్ స్పెషాలిటి హాస్పిటల్ సేవలు
- ప్రజా వైద్యంపై సీఎం స్పెషల్ ఫోకస్
- నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయండి
- సకల సౌకర్యాలతో హాస్పిటల్ ఏర్పాటు
- వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య
- హాస్పిటల్ నిర్మాణ పనులను పరిశీలించిన ఎంపీ,కలెక్టర్

ప్రభాత గమనం, వరంగల్ బ్యూరో : ఉత్తర తెలంగాణకు వైద్య రంగంలో పెద్ద దిక్కుగా నిలిచేలా వరంగల్లో నిర్మాణంలో ఉన్న మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు వేగంగా కొనసాగుతున్నాయని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య తెలిపారు. పేద ప్రజలకు హైదరాబాద్ స్థాయి వైద్య సేవలు ఓరుగల్లు లోనే అందించాలన్న లక్ష్యంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. జిల్లా కలెక్టర్ సత్య శారదతో కలిసి ఎంపీ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఎంజీఎం సూపరింటెండెంట్, ఎల్ అండ్ టీ, ఆర్ అండ్ బీ, విద్యుత్, జీడబ్ల్యూఎంసీ, ఫైర్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

### 24 అంతస్తుల్లో పనులు పరిశీలన

ఎంపీ స్వయంగా 24 అంతస్తుల భవనంలోని అన్ని ఫ్లోర్‌లలో తిరిగి పనుల పురోగతిని పరిశీలించారు. అత్యవసర సేవల కోసం ఏర్పాటు చేస్తున్న విభాగాలు, బెడ్లకు ఆక్సిజన్ లైన్లు, ఫైర్ సేఫ్టీ వ్యవస్థ, సెంట్రల్ ఏసీ, విద్యుత్, నీటి పైప్‌లైన్ కనెక్షన్లను పరిశీలించారు. క్యాన్సర్ విభాగానికి రేడియేషన్ థెరపీ బంకర్లు, ఓపీ, ఐపీ సేవలు, ఆపరేషన్ థియేటర్లు, ఆడిటోరియం నిర్మాణ పనులను సమీక్షించారు. పనులు నాణ్యతతో, ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేసి త్వరలోనే ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. సరిపడా డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, పారా మెడికల్ సిబ్బందిని నియమించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభమైతే వరంగల్‌తో పాటు చుట్టుపక్కల జిల్లాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని ఎంపీ డా. కడియం కావ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ ఈ రాఘవరెడ్డి, ఆర్ అండ్ బి ఈఈ రాజేందర్, ఎల్ అండ్ టి ప్రాజెక్టు మేనేజర్ శ్రవణ్ కుమార్, ఎంజీఎం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్ చంద్రారెడ్డి, ఆర్ఎంఓ అశ్విన్ కుమార్, జిల్లా ఫైర్ అధికారి శ్రీధర్ రెడ్డి, ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గీతం రెడ్డి, ఆర్ అండ్ బి ఎలక్ట్రికల్ ఈఈ నర్సయ్య, మున్సిపల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, తహసీల్దార్ శ్రీకాంత్ తదితర అధికారులు పాల్గొన్నారు.



# బాలబాలికల పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు ఏర్పాటు చేయాలి

- విద్యార్థుల డ్రాప్ అవుట్ తగ్గించాలి
- పెరుగుతున్న సంఖ్యకు అనుగుణంగా కొత్త హాస్టళ్లు నిర్మించాలి

కేసముద్రం, ఫిబ్రవరి 27 (ప్రభాత గమనం): కేసముద్రం పట్టణంలో బాలబాలికల కోసం పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు ఏర్పాటు చేయాలని డీఎస్‌ఏ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రవణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యే మురళి నాయక్కు అందజేశారు. ఈ సందర్భంగా శ్రవణ్ మాట్లాడుతూ, ఎడ్యుకేషనల్ హబ్‌గా అభివృద్ధి చెందుతున్న కేసముద్రంలో ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్ విద్యార్థుల కోసం వసతి సౌకర్యాలు అత్యవసరమన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులపై ఆర్థిక భారం తగ్గించేందుకు హాస్టళ్లు అవసరమని తెలిపారు. పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని తక్షణమే కొత్త హాస్టళ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. విద్యార్థుల డ్రాప్ అవుట్ శాతం తగ్గించాలంటే ప్రభుత్వ వసతి సౌకర్యాలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. వినతిపత్రంపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌ఏ నాయకులు రాజు, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.




# ఎంపీఓను కలిసిన సర్పంచ్ కైక

- పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్
- కేసముద్రం మండలాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయాలని వినతి

కేసముద్రం ఫిబ్రవరి 27(ప్రభాత గమనం): కేసముద్రం మండల నూతన పంచాయతీ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన హరీష్ ను క్యాంపు తండా గ్రామపంచాయతీ సర్పంచ్ ధరావత్ కైక శుక్రవారం నాడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కేసముద్రం మండలాన్ని అన్ని విధాల అభివృద్ధి పరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి ధరావత్ రవి నాయక్, నారాయణపురం సర్పంచ్ యమునా సుమన్,కల్వల ఉప సర్పంచ్ రవి, రమేష్ లు పాల్గొన్నారు.

# ఇసుక తోడేళ్లపై పోలీస్ నజర్

- గ్రామాల్లో తనిఖీలు.. డంప్ లపై పోలీసుల వరుస దాడులు
- రహదారులపై కందకాలు తవ్వించి ఇసుక ట్రాక్టర్ల అడ్డగింపు
- కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరిక



వరంగల్ బ్యూరో, ప్రభాత గమనం / స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 27: మండలంలోని కొత్తపల్లి, తాటికొండ గ్రామాల్లో కొంతకాలంగా రాత్రింబగళ్లు సాగుతున్న అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు కఠిన చర్యలు ప్రారంభించారు. అనుమతి లేకుండా ఇసుక తవ్వకం చేసి ట్రాక్టర్ల ద్వారా రహస్యంగా తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. స్టేషన్ ఘన్‌పూర్ సీఐ జి.వేణు ఆదేశాల మేరకు ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి గ్రామాల పరిసర ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. అక్రమంగా నిల్వ ఉంచిన భారీ ఇసుక డంపులను గుర్తించి జేసీబీల సాయంతో తొలగించారు. ఇసుక రవాణాకు ఉపయోగిస్తున్న ప్రధాన గ్రామీణ రహదారులపై కందకాలు తవ్వించి ట్రాక్టర్ల రాకపోకలను అడ్డుకున్నారు.

### కఠిన చర్యలు తప్పవు: సీఐ జి.వేణు



ప్రభుత్వ అనుమతి లేకుండా జరిగే ఇసుక తవ్వకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని సీఐ హెచ్చరించారు. అక్రమ రవాణా చేస్తే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. గ్రామాల్లో ఎవరైనా అక్రమ కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ముందుముందు కూడా ప్రత్యేక నిఘా కొనసాగుతుందని తెలిపారు.



# విద్యుత్ లైన్ ను మార్చండి

- ఏఈకి వినతిపత్రం అందజేసిన బేతోలు గ్రామస్తులు

మహబూబాబాద్, ఫిబ్రవరి 27 (ప్రభాత గమనం): మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బేతోలు గ్రామ బీసీ కాలనీలో ఇండ్లపైగా వెళ్తున్న 11 కేవీ విద్యుత్ లైన్‌ను తక్షణమే మార్చాలని గ్రామస్తులు శుక్రవారం ఏఈకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆరవ వార్డు పరిధిలో ఉన్న బీసీ కాలనీలో ఇండ్లపై నుంచి 11 కేవీ లైన్ వెళ్లడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లభించలేదని తెలిపారు. ఇప్పటికైనా చర్యలు తీసుకుని లైన్‌ను సురక్షిత ప్రాంతానికి మార్చాలని కోరారు. అదేవిధంగా గ్రామానికి ప్రస్తుతం ముగిచెర్ల జగ్గయ్య తండా ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరా అవుతుందని, రాత్రి వేళల్లో రెండు నుంచి మూడు గంటల పాటు కరెంట్ నిలిపివేస్తున్నారని, దీంతో ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మహబూబాబాద్ టౌన్ నుంచి బేతోలు ఆరవ వార్డుకు విద్యుత్ సరఫరా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో భూక్య రాంజి, షేక్ ఖాదర్ బాబా, గద్దపాటి సంతోష్, అనపర్తి మదన్, గూగుల్ కిషన్, సిరికొండ కృష్ణ, షేక్ జావిద్, గుగులోతు సోమ్లా, ఏనుగంటి వెంకన్న, భూక్య కోటేష్ తదితరులు పాల్గొన్నారు.



# కడిగిన ముత్యంలా వచ్చా

- లిక్కర్ స్కాం ఫేక్ అని ముందు నుంచే చెబుతున్నా
- ఎంతో మానసిక క్షోభను అనుభవించా
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**ప్రభాత గమనం, హైదరాబాద్ :**

లిక్కర్ స్కాం కేసు నుంచి తాను కడిగిన ముత్యంలా బయటకు వచ్చానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హర్షం వ్యక్తం చేశారు. ఈ కేసులో ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టుకు తనకు క్లీన్‌చిట్ ఇచ్చిందని తెలిసిన తర్వాత, ఆమె హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. గత మూడు సంవత్సరాలుగా తనపై జరిగిన దుష్ప్రచారానికి, అవమానకర విమర్శలకు ఈ తీర్పుతో తెరపడిందని ఆమె పేర్కొన్నారు. కేవలం రాజకీయ కక్షతోనే తనపై ఈ అక్రమ కేసు పెట్టారని ఆమె మండిపడ్డారు. న్యాయ వ్యవస్థపై తాను పెట్టుకున్న నమ్మకం నేడు నిజమైందని ఆమె హర్షం వ్యక్తం చేశారు. లిక్కర్ కేసులో ఎలాంటి అవకతవకలు జరగలేదని కోర్టు తేల్చిందని ఆమె వెల్లడించారు. రాజకీయ కారణాలతోనే తనను ఇబ్బంది పెట్టారని ఆమె ఆరోపించారు. ఈ లిక్కర్ కేసును ప్రజలు ఎవరూ నమ్మలేదని ఆమె తెలిపారు. కష్టకాలంలో తనకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తాను మొదటి నుంచి చెబుతున్నదే నేడు నిజమైందని ఆమె స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థపై తాను పెట్టుకున్న నమ్మకం ఏమాత్రం వమ్ము కాలేదని ఆమె పేర్కొన్నారు. ఈ కేసు నుంచి విముక్తి లభించడం దేవుడిచ్చిన వరంగా తాను భావిస్తున్నట్లు ఆమె తెలిపారు. లిక్కర్ కేసు అనేది ఒక ముందస్తు ప్రణాళికతో కూడిన రాజకీయ కుట్ర అని ఆమె విమర్శించారు. లిక్కర్ స్కాం కేసును అడ్డం పెట్టుకుని తనపై రకరకాలుగా మాట్లాడారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తనను మానసికంగా హింసించిన వారు ఇప్పుడు సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. కేవలం రాజకీయ కుట్రతోనే ఈ కేసు పెట్టారని ఇప్పుడు పూర్తిగా నిరూపితమైందని ఆమె వెల్లడించారు. ఈ కేసులో అసలు ఏం జరిగిందో ఇప్పుడు అందరికీ ఒక స్పష్టత వచ్చిందని ఆమె అభిప్రాయపడ్డారు.

## కల్వకుంట్ల కవితకు క్లీన్ చిట్

- ఆమెతో మొత్తం 23 మందికి ఊరట
- లిక్కర్ స్కాం కేసును కొట్టేసిన ఢిల్లీ కోర్టు
- చార్జీషీటుకు, సమర్పించిన ఆధారాలకు పొంతనలేదని సీబీఐకి అక్షింతలు

ప్రభాత గమనం, హైదరాబాద్ : దేశ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించిన ఢిల్లీ మద్యం విధానం కేసులో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు భారీ ఊరట లభించింది. శుక్రవారం ఈ కేసును విచారించిన ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ఆమెతో పాటు మిగతా 23 మందిపై సీబీఐ మోపిన అభియోగాలన్నింటినీ కొట్టివేస్తూ క్లీన్ చిట్ ఇచ్చింది. చార్జీషీటుకు, సమర్పించిన ఆధారాలకు పొంతనలేదని సీబీఐపై అక్షింతలు వేసింది. వాస్తవానికి ఢిల్లీ ప్రభుత్వ మద్యం పాలసీ రూపకల్పనలో అవినీతి జరిగిందని, సౌత్ లాబీ ప్రతినిధిగా కవిత వంద కోట్ల రూపాయల కిక్ బ్యాగులు చెల్లించారని సీబీఐతోపాటు పలు కేంద్ర దర్యాప్తు సంస్థలు ఆరోపించాయి. ఈ క్రమంలోనే 2024 మార్చిలో ఈడీ ఆమెను హైదరాబాద్‌లో అరెస్టు చేయగా ఐదు నెలల పాటు తీహార్ జైలులో ఉండాల్సి వచ్చింది. అయితే సీబీఐ దాఖలు చేసిన ఛార్జిషీట్‌లో నేరపూరిత కుట్రకు సంబంధించి ఎలాం టి పక్కా ఆధారాలు లేవని కోర్టు స్పష్టం చేసింది. మనీ ట్రయల్‌కు సంబంధించి విచారణ సంస్థలు చూపిన సాక్ష్యాలు బలంగా లేవని పేర్కొంటూ న్యాయమూర్తి జితేంద్ర సింగ్ ఈ సంచలన తీర్పును వెలువరించారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే ఈ కేసును సృష్టించారని కోర్టు అభిప్రాయపడుతూ కవితతో పాటు ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాలను సైతం నిర్దోషులుగా ప్రకటించింది.

## ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్..

### పెండింగ్ బిల్లులు రూ.745 కోట్లు విడుదల

ప్రభాత గమనం, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లుల విషయంలో డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆయన ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ అధికారులు రూ.745 కోట్ల పెండింగ్ బిల్లులను విడుదల చేశారు. గతంలో ఉద్యోగ సంఘాలకు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం పెండింగ్ బిల్లులను విడతల వారీగా క్లియర్ చేస్తోంది. జూన్ మాసం నుంచి ప్రతి నెలా రూ.700 కోట్లకు తగ్గకుండా ఉద్యోగుల పెండింగ్ బిల్లులను మంజూరు చేస్తున్నారు. తాజాగా, విడుదల చేసిన రూ.745 కోట్లతో ఉద్యోగులకు పెద్ద ఊరట లభించినట్లయింది. ఉద్యోగుల బిల్లులతో పాటు గ్రామ పంచాయతీల అభివృద్ధికి కూడా ప్రభుత్వం పెద్దపీట వేసింది. పంచాయతీల కోసం మరో రూ.389 కోట్లను ఆర్థిక శాఖ అధికారులు విడుదల చేశారు. ఈ నిధుల విడుదల ద్వారా గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులు వేగవంతం కావడంతో పాటు, ఉద్యోగుల ఆర్థిక అవసరాలు తీరనున్నాయి.

## 'పోలీస్ అకాడమీ యాన్యువల్ మ్యాగజైన్ ఆవిష్కరించిన సీఎం రేవంత్

ప్రభాత గమనం, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా పోలీసింగ్, శాంతిభద్రతలు, దర్యాప్తు, ట్రాఫిక్ నిర్వహణ బందోబస్తు విధుల్లో మహిళా సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ఉమెన్ కాన్ఫరెన్స్ ఫర్ పోలీస్, పోలీస్ అకాడమీ యాన్యువల్ మ్యాగజైన్ – 2025 సీఎం రేవంత్ రెడ్డి, డీజీపీ శివధర్ రెడ్డి శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ తమిళనాడు వంటి వివిధ రాష్ట్రాల్లో మహిళల నియామకం,శిక్షణలపై ఉత్తమ పద్ధతులను అధ్యయనం చేయడానికి ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్ర పోలీసింగ్‌లో మహిళల భాగస్వామ్యం మరింత బలోపేతం చేయడానికి తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ వుమెన్ కాన్ఫరెన్స్ ఫర్ పోలీస్ సదస్సును నిర్వహించడం, చర్చలు, సిఫార్సులను పుస్తక రూపంలో విడుదల చేయడాన్ని సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు.



## కౌన్సిలర్ ఆగె రాముకు ఘనంగా సన్మానం

కేసముద్రం ఫిబ్రవరి 27(ప్రభాత గమనం): ఇటీవలే మున్సిపాలిటీ పదకొండవ వార్డు కౌన్సిలర్ గా విజయం సాధించిన ఆగె రామును కిష్టాపురం తండా వాసులు శుక్రవారం నాడు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ గా బాధ్యతలు స్వీకరించిన ఆగె రాముకు శుభాకాంక్షలు తెలిపి మిఠాయిలు తినిపించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్ రాథోడ్, గుంజ సంతోష్, అరుణ్, నరేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# మిథేన్ అన్వేషణకు సింగరేణికి అవకాశం

- వేలంలో పాల్గొనాలని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ సూచన
- సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతితో ఏడీజీ సచివ్ కుమార్ భేటీ

**తెలంగాణ బ్యూరో, ప్రభాత గమనం :**

బొగ్గు అన్వేషణలో 13 దశాబ్దాల సుదీర్ఘ అనుభవం కలిగిన సింగరేణి కంపెనీకి బొగ్గు పొరల్లో నిక్షిప్తమై ఉన్న కోల్ బెడ్ మిథేన్ (సీబీఎం) వనరుల అన్వేషణకు అవకాశం లభించనుంది. కేంద్ర మినిస్ట్రీ ఆఫ్ పెట్రోలియం అండ్ నాచురల్ గ్యాస్ అధికారులు శుక్రవారం సాయంత్రం సింగరేణి భవన్‌లో సంస్థ ఛైర్మన్ & ఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతిని కలిసి, సింగరేణి పరిధిలో గుర్తించిన మూడు ప్రధాన బ్లాక్‌ల అన్వేషణలో పాల్గొనాలని సూచించారు.




దేశవ్యాప్తంగా కోల్ బెడ్ మిథేన్ ఉత్పత్తి కోసం పలు రాష్ట్రాల్లో బ్లాక్‌లు గుర్తించగా, ప్రాణహిత–గోదావరి లోయ ప్రాంతం కూడా అందులో భాగమని తెలిపారు. ఈ బ్లాక్‌ల అన్వేషణ కోసం కేంద్రం త్వరలోనే వేలం నిర్వహించనుందని, అందులో సింగరేణి పాల్గొనాలని కోరారు. సింగరేణి పరిధిలో ఆరు జిల్లాల్లో మూడు ప్రధాన బ్లాక్‌లు గుర్తించినట్లు వెల్లడించారు. మంచిర్యాల–పెద్దపల్లి–కొమరం భీమ్ జిల్లాలు కలిపి ఒక బ్లాక్ (సుమారు 5 బిలియన్ క్యూబిక్ మీటర్లు), భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఒక బ్లాక్ (2 బిలియన్ క్యూబిక్ మీటర్లు), భద్రాద్రి కొత్తగూడెం–ములుగు జిల్లాలు కలిపి మరో బ్లాక్ (12 బిలియన్ క్యూబిక్ మీటర్లు) మొత్తం మూడు బ్లాక్‌లలో సుమారు 19 బిలియన్ క్యూబిక్ మీటర్ల మిథేన్ వనరులు ఉన్నట్లు ప్రాథమిక అంచనా ఉందని తెలిపారు. 'వికసిత్ భారత్–2047' లక్ష్యంలో భాగంగా చమురు, ఇంధన రంగాల్లో స్వయం సమృద్ధి సాధనకు ఇది కీలకమని పేర్కొన్నారు.ఈ ప్రతిపాదనపై సమగ్రంగా చర్చించి నిర్ణయం తీసుకుంటామని సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి తెలిపారు. సమావేశంలో పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ అడిషనల్ డైరెక్టర్ జనరల్ సచివ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.